సాక్షి సూర్యాపేట

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



పుడమి పుత్రికల ప్రకృతి సాగు
పంటల సాగులో నూతన ఆవిష్కరణలు సృష్టిస్తూ అవార్డులు పొందుతున్నారు ఈ పుడమి పుత్రికలు. - IIలో



ముగ్గురి అరెస్టు
చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను మిర్యాలగూడ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. - IIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42°/26°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-38 (శనివారం సాయంత్రం)
సహర్ 4-36 (ఆదివారం ఉదయం)

ముందస్తు ప్రణాళికేదీ?

వసతులు కల్పించకుండానే ప్రారంభిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- వేధిస్తున్న గోనె సంచులు, టార్పాలీన్ల కొరత
- ఇప్పటికీ పూర్తి కాని ట్రాన్స్‌పోర్ట్ టెండర్ ప్రక్రియ
- ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనాలంటున్న రైతులు
- కొనుగోలు లక్ష్యం 7.04 లక్షల మెట్రిక్ టన్నులు



పెన్‌పహాడ్ : మాచారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

దురాజ్‌పల్లి(సూర్యాపేట): జిల్లాలో ఏటా ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్నారు. అవసరమున్న గన్నీ బ్యాగులు, టార్పాలీన్లు సరఫరా చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండానే హడావుడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రతి సీజన్‌లోనూ ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఏటా తలెత్తుతున్న సమస్యలను అధిగమించి ఈ సారైనా ధాన్యం కొనుగోలు సజావుగా చేస్తారా.. లేదా అనేది సందిగ్ధంగా మారింది.

గోనె సంచుల కొరత

కొనుగోలు కేంద్రాల్లో ప్రతి సీజన్‌లో గోనె సంచుల కొరత ఏర్పడుతోంది. ప్రభుత్వం సకాలంలో గోనె సంచులను సరఫరా చేయాల్సి ఉన్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఈ సీజన్‌లో కూడా తగినన్ని గోనె సంచులు అందుబాటులో లేవు. మిల్లర్ల, రేషన్ డీలర్ల దగ్గరే గోనె సంచులు ఉండడం వల్ల వారి నుంచి సంచులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక చాలా కేంద్రాల్లో చిరిగిన గోనె సంచులు ఇస్తున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌పోర్టు సమస్య ప్రతి సీజన్‌లో ఏర్పడుతోంది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా నేటికీ ట్రాన్స్‌పోర్టు టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు.

తేమ శాతం లెక్కింపు, తూకాల్లో మోసాలు

కొనుగోలు నిబంధన ప్రకారం 17శాతం ధాన్యంలో తేమ ఉండాలి. అత్యధిక భాగం వరి కోతలు మిషన్ల ద్వారా జరుగుతున్నాయి. మిషన్లతో వరికోయడం వల్ల తేమ ఎక్కువ ఉండే అవకాశం ఉన్నది. రైతులు ధాన్యం ఆరబెట్టి తీసుకువెళ్లిన సందర్భాల్లో కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమ ఉన్నదని నిర్ధారణ చేసిన తర్వాత కూడా..మిల్లర్ల వద్ద అధిక తేమ శాతం ఉన్నట్లు చూపి మద్దతు ధర లేద బరువులో కోతలు పెడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల ప్రమేయం లేదని చెబుతున్నా ఆచరణలో మిల్లర్లు చెప్పిన విధంగానే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. అంతే కాకుండా తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. గతంలో తరుగు పేరుతో క్వింటాల్‌కు 2 నుంచి 3 కేజీలు కోత పెట్టిన సందర్భాలు ఉన్నాయి.

ధాన్యం డబ్బు కోసం ఎదురు చూపులే

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించి అష్టకష్టాలు పడి అమ్మితే డబ్బుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోంది. ధాన్యం విక్రయించిన 72గంటల్లో డబ్బులు చెల్లించాలన్న నిబంధన ఉంది. కానీ రెండు మూడు నెలలు గడిచినా రైతు చేతికి డబ్బు అందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను అధిగమిస్తేనే ధాన్యం కొనుగోలు సవ్యంగా సాగనున్నది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొరత ఇలా..

	గన్నీ బ్యాగులు	టార్పాలీన్‌లు	ప్యాడీ క్లీనర్లు	ఎలక్ట్రానిక్ కాంటాలు
అవసరమున్నవి	1,76,10,375	8,280	552	552
అందుబాటులో ఉన్నవి	72,46,090	3,748	355	309
కావాల్సినవి	1,03,64,285	4,532	197	243

276 కేంద్రాల ద్వారా సేకరణ

జిల్లాలో ప్రస్తుతం రైతులు ముమ్మరంగా వరి కోతలు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో 1,90,253 హెక్టార్లలో వరిసాగు కాగా 12,72,705 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 7,04,415 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. ఇందుకు ఐకేపీ ఆధ్వర్యంలో 170, పీఏసీఎస్‌ల ద్వారా 106 మొత్తం 276 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఇప్పటికే ఒక్కొక్కటిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. అయితే కొనుగోలు నిబంధనల పేరుతో మిల్లర్లు, దళారులు రైతును నిలువునా దోచేస్తున్నారు. ఇక.. అధికారులు మాత్రం గన్నీ సంచులు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించలేదు. ఫలితంగా రైతులకు గతంలో మాదిరిగా ఇబ్బందులు తొలగేలా కనిపించడం లేదు.

అంబేడ్కర్ రాజ్యాంగమే శ్రీరామ రక్ష



అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- జ్ఞానానికి, మేధస్సుకు సింబల్ బాబాసాహెబ్
- మహనీయుడి ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలి
- అదే రాజ్యాంగ నిర్మాతకు అసలైన నివాళి
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ తదితరులు

భానుపురి (సూర్యాపేట) : అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి శ్రీరామ రక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను అమలు చేయడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని సూర్యాపేటలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం క్రాస్ రోడ్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జ్ఞానానికి, మేధస్సుకు సింబల్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని శాశ్వతంగా ఉంచడానికే సీఎం కేసీఆర్ తెలంగాణ సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత పేరు పెట్టడమే కాకుండా ఆ మహనీయుని 125అడుగుల ఎత్తైన విగ్రహాన్ని రాజధాని నడిబొడ్డున ఏర్పాటు చేయించారని తెలిపారు. విద్యను హక్కుగా పొందుపరచి దేశానికి వెలుగులు ఇచ్చిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ఆయన కట్టుబడి ఉన్న తీరు ప్రజాస్వామ్యానికి వెన్నుముకగా నిలుస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ రంగంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు మంత్రి సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి అంబేడ్కర్ విగ్రహంతో సెల్ఫీ తీసుకుని నీరాజనం పలికారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్‌నారాయణగౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణమ్మ, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, బీఆర్‌ఎస్ కాష్ట కార్యదర్శి వై.వీ.చివ్వెంల ఎంపీపీ కుమారి బాబు నాయక్, జెడ్పీటీసీ సంజీవనాయక్, కౌన్సిలర్లు జ్యోతి శ్రీవిద్య, భరత్ మహాజన్, వెంపటి గురూజీ, చిన శ్రీరాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టు కొండ సత్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీపీఎస్‌ను రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఎస్ ఈయూ నాయకులు

సూర్యాపేటటౌన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేశాయని, ఆరో రాష్ట్రంగా తెలంగాణలో కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 2004 నుంచి ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ భద్రత లేక భయభ్రాంతులతో జీవనం గడుపుతున్నారన్నారు. ఈ నెల 16వ తేదీన జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ నుంచి శంకర్ విలాస్ సెంటర్ వరకు జరిగే పెన్షన్ కాన్షిట్యూషనల్ మార్చ్ ర్యాలీకి అన్ని ఉపాధ్యాయ సంఘాలు రావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్, గునగంటి నర్సింహ్మారావు, సతీష్‌కుమార్, వీరారెడ్డి, విజయ్, సురేందర్, సురేష్, సాలయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర స్థాయి సృజనాటెక్ ఫేస్ట్ (2022–23) పోటీల్లో తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో కళాశాలలోని మెకానికల్ కోర్సు విభాగానికి చెందిన విద్యార్థులు తయారు చేసిన సోలార్, గ్రాస్ కటింగ్ యంత్రానికి (మల్టీపర్పస్) ప్రథమ బహుమతి వచ్చిందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్జేడీ ఎ.పుల్లయ్య, కార్యదర్శి సి.శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.25 వేల నగదు బహుమతిని ప్రిన్సిపాల్ రవీందర్, విద్యార్థులు కౌశిక్, పవన్‌కుమార్, జయచంద్ర, అఖిల్‌కు అందజేశారు. విద్యార్థుల గైడ్ లెక్చరర్ ఎన్.మల్లయ్యకు రూ.500 నగదు బహుమతిని అందజేశారు.

వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం



మాంగళ్యం చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచాంగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణాలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతకు సమ్మెబాట

- 28న సమ్మె నోటీస్ ఇవ్వాలని జేపీఎస్‌ల నిర్ణయం
- ఇప్పటికే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత
- ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె తప్పదని అల్టిమేటం
- 475 పంచాయతీల్లో 327మంది జేపీఎస్‌లు, 47మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహణ



అర్వపల్లిలో ఎంపీపీ, జెడ్పీటీసీలకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు (ఫైల్)

అర్వపల్లి: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర. సుమారు 50రకాల విధులు నిర్వర్తిస్తూ 24గంటలు సేవలందిస్తున్నారు. అయితే, ఇలాంటి పంచాయతీ కార్యదర్శులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈనెల 28న సమ్మె నోటీసులు ఎక్కడికక్కడ ఇవ్వనున్నారు. అలాగే వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. మూడేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌తో ఉద్యోగాల్లోకి తీసుకున్న ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తయినా రెగ్యులరైజ్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన బాట పడుతున్నారు. 2019ఏప్రిల్ నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. అలాగే ఇటీవల కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నచోట అవుట్ సోర్సింగ్ విధానంలో పంచాయతీ కార్యదర్శులను కొందరిని నియమించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా మార్చాలని కోరుతున్నారు.

327మంది జేపీఎస్‌లు

సూర్యాపేట జిల్లాలో 475 గ్రామపంచాయతీలు ఉండగా 327మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 47మంది అవుట్‌సోర్సింగ్ కార్యదర్శులు పనిచేస్తున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జూనియర్ పంచాయతీ, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. మండలాల వారీగా ఎక్కడికక్కడ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు తమ సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.


రెగ్యులరైజ్ చేయాలి



“ నాలుగేళ్లుగా ప్రొబెషనరీ విధానంలో పనిచేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇందుకోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం.

– నవీన్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్, జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం స్పందించాలి



“ జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా నియమించాలని కోరుతూ ఈ నెల 28న సమ్మె నోటీసు ఇస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలి. లేనిచో సమ్మె నిర్వహిస్తాం.

– జి.నాగరాజు, టీపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నూతనకల్ : గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గౌడజన హక్కుల పోరాట సమితి పార్టీలకు అతీతంగా, గౌడ హక్కుల పరిష్కారానికి పోరాడుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో గౌడ కులస్తుల అభివృద్ధికి రూ. 500కోట్లు , ప్రతి గ్రామంలో గౌడ సొసైటీ ఏర్పాటుకు ప్రభుత్వం భూమి కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు బిక్కి బుచ్చయ్యగౌడ్, పులుసు లింగమల్లయ్య, మారగాని రమేష్‌గౌడ్, తొట్ల ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిలు గౌతమ్‌ప్రసాద్, సాకేత్‌మిత్ర

మఠంపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ మహనీయులైన డా.బీఆర్ అంబేడ్కర్, మదర్‌థెరిస్సాలను ఆదర్శంగా తీసుకోవాలని సూర్యాపేట ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గౌతమ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అల్లీపురంలో హుజూర్‌నగర్ జూనియర్ సివిల్‌జడ్జి సాకేత్‌మిత్రతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మదర్‌థెరిస్సాల విగ్రహాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకయ్య, ఫాదర్ తానయ్య, ఎస్‌ఐలు ఇరుగురవి, సుందరయ్య పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కారానికే పోరు యాత్ర

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

చివ్వెంల(సూర్యాపేట) : ప్రజా సమస్యల పరిష్కారానికే పోరుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న పోరుయాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం నుంచి ప్రారంభమైన యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజలు బాధలు మాత్రం తీరడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బతకలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, కొత్తపల్లి శివకుమార్, కొత్తపల్లి రేణుక, అఖిల్, లక్ష్మన్న, నరసన్న, రాంజీ, రేణుక, జీవన్, పద్మ పాల్గొన్నారు.

వడదెబ్బతో.. జాగ్రత్త !

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తీవ్ర జ్వరం, నీరసం ప్రధాన లక్షణాలు
- సత్వర చికిత్స అందకపోతే ప్రాణాపాయం
- అసంక్రమిత వ్యాధుల జిల్లా వైద్యాధికారి కళ్యాణచక్రవర్తి సూచనలు



చిలుకూరు : జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను బెంబేత్తిస్తున్నాయి. ఏ మాత్రం ఎండకు తిరిగినా నీరసించిపోతున్నారు. ఎలాంటి రక్షణ లేకుండా తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బ తగిలితే శరీర ఉష్ణోగ్రత 105.1 ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. ఇది మామూలు జ్వరం కంటే భిన్నమైందని వైద్యులు పేర్కొంటున్నారు. డీహైడ్రేషన్ వల్ల మనిషి నీరసించి పోతాడు. వడదెబ్బకు గురైన వారిపట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయం జరిగే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో సంభవించే ప్రమాదకరమైన వడదెబ్బ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా వడదెబ్బ బారినపడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అసంక్రమిత వ్యాధుల జిల్లా వైద్యాధికారి కళ్యాణచక్రవర్తి వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, లక్షణాలు తెలియజేశారు.

వడదెబ్బ లక్షణాలు

- శరీర ఉష్ణోగ్రత 105.1 ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా కలిగి ఉండడం.
- తీవ్రమైన తలనొప్పితో బాధపడడం.
- నీరసంగా పొడిబారిపోవడం, వాంతులు, విరేచనాలు అవుతాయి.
- మూత్రము గాఢ పసుపురంగులో ఉండి మంటగా రావటం.
- మనిషి సొమ్మసిల్లి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బకు గురైనట్లు గుర్తించాలి.

వడదెబ్బకు కారణాలు

- మనిషి నీరు తక్కువగా తీసుకోవడం.
- మత్తుపానియాలు ఎక్కువగా తీసుకోవడం.
- ఎండలో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా తిరగడం. ఎక్కువగా మాంసాహారం భుజించడం.

అందించాల్సిన చికిత్స

- వడదెబ్బకు గురైన వ్యక్తిని చల్లని, నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి తడిగుడ్డతో శరీరాన్ని పలుమార్లు తుడవాలి.
- ఎక్కువగా నీరు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తాగించాలి.
- వీలైనంత త్వరగా సమీపంలోని ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం చేయించాలి.
- అపస్మారకస్థితిలో ఉంటే ఫ్లూయిడ్స్ పెట్టించాలి.
- రోగి బీపీ పల్స్‌ను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.
- పూర్తిగా కొలుకున్న తరువాతనే ఆస్పత్రి నుంచి తీసుకెళ్లాలి.

నివారణ ఇలా

- ఎండలో ఎక్కువగా తిరగరాదు.తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తలపై రుమాలు గానీ, వెడల్పయిన టోపీలు ధరించాలి.
- నీరు, ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. దీని కారణంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు.
- మత్తు పానియాలు ఎక్కువగా సేవించవద్దు. మద్యం సేవించడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- వేసవిలో తప్పనిసరిగా వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలి.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో ఎండలో ఆడనివ్వకూడదు. చెట్ల నీడలో ఇంటిలో ఆడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రతిరోజూ ఎనిమిది లీటర్ల నీరు తాగాలి



“ వేసవిలో ప్రతిరోజూ ఎనిమిది లీటర్లకు తక్కువ కాకుండా నీళ్లు తాగాలి. తెల్లని కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్న వారు ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు. పుచ్చకాయ లాంటి పండ్లను తీసుకోవాలి. ఎండలో తిరగడం తగ్గించుకుని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాలంటే తలకు టోపీ, తలపాగ ధరించి వెళ్లాలి. వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

– కళ్యాణ చక్రవర్తి, జిల్లా అసంక్రమిత వైద్యాధికారి

ఘంటా గోపాల్‌రెడ్డికి నివాళి



గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు, కుటుంబ సభ్యులు

గరిడేపల్లి : అరబిందో గ్రామీణ సేవా సంస్థ ద్వారా రైతులకు విశేష సేవలు అందించిన ఘంటా గోపాల్‌రెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రోగ్రాం కో ఆర్డినేటర్, కేవీకే శాస్త్రవేత్త బి.లవకుమార్ అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో దివంగత డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి 5వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి క్యాంస్య విగ్రహానికి ఆయన సతీమణి కరత్నమాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గోపాల్ రెడ్డి కేవీకే స్థాపనతో ఇక్కడ వ్యవసాయ అభివృద్ధి ఎంతో జరిగిందన్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అరబిందో స్కూల్ ప్రిన్సిపాల్ గోవర్ధన్, కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యోగ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగదు స్వాహాపై విచారణ

పెన్‌పహాడ్ : వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్, ఉపాధి హామీ డబ్బుల్లో చిల్లర డబ్బులను బీపీఎం స్వాహా చేస్తున్నారనే ఆరోపణలపై లబ్ధిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యాపేట పోస్టల్ ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సురేష్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నాగుల పాటి అన్నారం గ్రామానికి చెందిన బీపీఎం సాంబయ్య ఆసరా పెన్షన్‌దారులకు రూ.16లు చెల్లించడం లేదని ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలీ చిల్లర డబ్బులు ఇవ్వడం లేదని చేసిన ఆరోపణలపై విచారణ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని నారాయణగూడెం, నాగులపహాడ్ గ్రామాల్లో లబ్ధిదారులను విచారణ చేపట్టారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అప్పయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో టాటాఏస్ వాహనం దగ్ధం

చివ్వెంల(సూర్యాపేట) : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి టాటాఏస్ వాహనం కాలిపోయింది. ఈ సంఘటన మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులో నేరేడుచర్ల–దురాజ్‌పల్లి రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయ్యద్ తన టాటాఏస్‌లో మామిడి కాయల లోడుతో సూర్యాపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో దురాజ్‌పల్లి గ్రామ శివారులోకి రాగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపి ప్రాణాలు దక్కించుకున్నాడు. వెంటనే విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వారు చేరకునే లోపు వాహనం పూర్తిగా కాలిపోయింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహానికి పోస్టుమార్టం

మునుగోడు : పూర్తిగా కుళ్లిపోయిన గుర్తుతెలియని ఓ మృతదేహానికి శుక్రవారం సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల ప్రకారం.. మండలంలోని కొరటికల్ శ్మశానవాటిక స్నానాల గదిలో గురువారం గుర్తుతెలియని మృతదేహం బయటపడిన విషయం విధితమే. దీంతో మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు వీలు లేకపోవడంతో పోలీసులు ఫోరెన్సి ల్యాబ్ వైద్యులను గ్రామానికి రప్పించి అక్కడే పోస్టుమార్టం చేయించారు. పోస్టుమార్టంలో ఆ మృతదేహం ఆడా, మగా అనేది గుర్తుపట్టలేని స్థితిలో ఉందని వెల్లడించారు. మృతదేహం ఉన్న గదిలో రక్తపు మరకలతో పాటు దుస్తువులు లభించాయి. వాటిని సీజ్‌చేసి మృతదేహాన్ని పంచాయతీ సిబ్బందితో అక్కడే ఖననం చేయించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.



తాను సాగు చేస్తున్న మిర్చిపంటను చూపుతున్న రైతు రజితారెడ్డి

ఈ మగువలు అసాధారణ ప్రతిభతో సాగులో అద్భుతాలు సృష్టిస్తున్నారు. వ్యవసాయంలో నూతన ఒరవడితో దూసుకెళ్తున్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు సృష్టిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ వ్యవసాయ ఉత్పత్తులను సొంతంగానే మార్కెటింగ్ చేసుకుంటున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా ఎరువుల తయారీ, కోళ్ల పెంపకం వంటివి చేపడుతూ ఆర్థికంగా నిలబడుతున్నారు. వారి ప్రతిభను గుర్తించిన పలు సంస్థలు వారిని అవార్డులతో సత్కరిస్తున్నాయి.

- సాక్షి, నల్లగొండ డెస్క్

పుడమి పుత్రికల ప్రకృతి సాగు

సాగులో నూతన ఆవిష్కరణలతో రాణిస్తున్న మహిళలు



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు నర్సరీలోని మొక్కల గురించి వివరిస్తున్న శశికళ

- సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తూ సొంతంగానే మార్కెటింగ్
- మొక్కలు, ఎరువులు విక్రయిస్తూ లాభాల బాట
- వీరి అసాధారణ ప్రతిభను గుర్తించి అవార్డులు ఇస్తున్న పలు సంస్థలు
- ఇటీవల నారీశక్తి పురస్కారం ప్రదానం

రసాయన ఎరువులకు దూరంగా..

తొమ్మిదేళ్లుగా వ్యవసాయంలో రాణిస్తూ.. ఎలాంటి రసాయన మందులు వాడకుండా సాగును లాభసాటిగా మార్చుకుంది చౌటుప్పల్ మండలం తమ్మలోనిబావి గ్రామానికి చెందిన వాకిటి రజితారెడ్డి. తన భర్త రాజేందర్‌రెడ్డికి తోడుగా సాగుపనుల్లో పాల్గొంటున్న రజితారెడ్డి సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తే ఎలాంటి లాభం లేకపోవడంతో నూతన ఆలోచన చేసింది. ఖర్చులు తగ్గించుకునేలా సేంద్రియ వ్యవసాయం చేయాలని నిర్ణయించుకుంది. ఆమె చేసిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. పెట్టుబడి తగ్గి దిగుబడులు రెండింతలు పెరిగాయి. తమకున్న నాలుగెకరాల భూమికి తోడు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని కూరగాయలు, వరి సాగులో రాణిస్తోంది. సాగుకు అవసరమైన అన్ని రకాల మందులు, ద్రావణాలను స్వయంగా తయారు చేసుకోవడంతోపాటు.. తన వద్దకు వచ్చే రైతులకు మెళకువలు నేర్పిస్తోంది.



జీవామృతం తయారు చేస్తున్న రజితారెడ్డి

సొంతంగానే మార్కెటింగ్

వరిలో సన్న రకలైన మైసూర్ మల్లిక, తెలంగాణ సోన సాగుచేస్తోంది. కూరగాయాల్లో టమాట, మిర్చి, తెల్ల వంకాయ, సొరకాయ, బీర, నల్లవంకాయ, బెండ, గోంగూర సాగు చేస్తోంది. అయితే రజిత సాగు చేసిన పంటల దిగుబడిని సొంతంగానే మార్కెటింగ్ చేసుకుంటోంది. వడ్లను బియ్యం పట్టించి తనకున్న పరిచయాలతో నేరుగా వారి ఇళ్లకే సరఫరా చేస్తోంది. కూరగాయలను చౌటుప్పల్‌లోని ఓ ప్రముఖ ఆర్గానిక్ హోటల్‌కు నిత్యం సరఫరా చేస్తోంది. ధరల హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా కూరగాయల సాగుతో నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల ఆదాయం పొందుతోంది. రజిత ఈ తొమ్మిదేళ్లలో వరుసగా రెండు సార్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డును పొందారు. గత నెల 31న తెలంగాణ, ఏపీకి చెందిన మంత్రులు సబితాఇంద్రారెడ్డి, ఆర్‌కే రోజా చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో నారీ శక్తి పురస్కారాన్ని అందుకున్నారు.

ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తా..



ప్రస్తుతం చేస్తున్న సాగు విధానం నాకు సంతృప్తిగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తాను. సేంద్రియ సాగుతో పెట్టుబడులు పూర్తిగా తగ్గాయి. దిగుబడులు పెరిగాయి. రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు, ఇతర అనేక రకాల పురస్కారాలు రావడం ఆనందంగా ఉంది. ఇది రైతులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

- వాకిటి రజితారెడ్డి

స్వయం సమృద్ధి సాధిస్తున్నా

మా వారు మరణించిన తర్వాత ఉద్యోగంలో చేరకుండా మాకున్న 18 ఎకరాల్లో వ్యవసాయం ప్రారంభించా. వరి, కూరగాయలు, బత్తాయిని సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నా. నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను రైతులకు సరఫరా చేస్తున్నా. అందరి సహకారంతో వ్యవసాయంలో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందడం ఆనందంగా ఉంది. రైతులకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో శ్రీ సాయి మాధవ నర్సరీ, శశి ఆర్గానిక్స్, శ్రీ సాయి మాధవ గోసంరక్షణ కేంద్రాలను ప్రారంభించా.

- కర్ర శశికళ



తాను తయారు చేసిన ద్రావణాల గురించి మంత్రి జగదీశ్‌రెడ్డికి వివరిస్తున్న శశికళ (ఫైల్)

నర్సరీలో మొక్కలు సిద్ధం

సేంద్రియ పద్ధతిలో సాగు, పూల మొక్కల నర్సరీ నెలకొల్పి ఔరా అనిపిస్తున్నారు త్రిపురారం మండలం దుగ్గపల్లి గ్రామానికి చెందిన శశికళ. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన శశికళ తన భర్త చనిపోయాక వారికున్న వ్యవసాయాన్ని చూసుకునే బాధ్యత ఆమెపై పడింది. తమ బత్తాయి తోటను కాపాడుకోవడానికి వర్మి కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలని భావించి రూ.3 వేలతో వర్మి కంపోస్ట్ యునిట్ ప్రారంభించారు. ఇప్పుడు సుమారు 50 పశువులతో గోశాల ఏర్పాటు చేసి.. వానపాములతో వర్మి కంపోస్ట్ తయారు చేస్తున్నారు. ఆ ఎరువును వరి పంటకు, బత్తాయి తోటకు, తన నర్సరీలో మొక్కల పెంపకానికి ఉపయోగిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఆమె ప్రతిభను గుర్తించి అనేక సంస్థలు అవార్డులతో సత్కరించాయి. ఇటీవల నారీ శక్తి అవార్డును సైతం ఆమె సొంతం చేసుకున్నారు.

ఆర్డర్లపై మొక్కల సరఫరా

తోటి రైతుకు నాణ్యమైన మొక్కలు అందించాలనే ఉద్దేశంతో శశికళ తన పొలంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఈ నర్సరీలో సేంద్రియ ఎరువులతో పెంచుతున్న పూలు, పండ్లు, డెకరేషన్, ఇంటీరియర్ డెకరేషన్‌కు సంబంధించిన మొక్కలను పెంచుతూ ఇతర ప్రాంతాల రైతులకు అందిస్తున్నారు. తోటలకు సంబంధించిన మామిడి, బత్తాయి, జామ, నిమ్మ మొక్కలు సైతం ఆర్డర్లపై ఇతర పాంత్రాలకు సరఫరా చేస్తున్నారు.



పొలంలో మిషన్‌తో వరినాట్లు వేస్తున్న జిట్టా జ్యోతిరెడ్డి

ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ అందుబాటులోకి తెస్తాం

మేము పాలు విక్రయించం. వాటితో నెయ్యి, పెరుగు తయారు చేస్తాం. బహిరంగ మార్కెట్‌లో దేశవాళీ ఆవు నెయ్యి కిలో రూ.3 వేలకు పైన ఉంటుంది. కానీ మా దగ్గర మాత్రం రూ.2 వేలే. పెరుగును తినడానికి, పొలాలకు పోషకాలు తయారు చేయడానికి ఎరువులుగా వాడుతున్నాం. మిగిలిన పెరుగును పాడిపశువులకు కుడితిలో కలిపి ఇస్తున్నాం. నేను ఎఫ్‌పీఓకు ఫౌండర్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఇప్పటికే అమేయ కృషి వికాస కేంద్రం, అమేయ ఆగ్రోనర్సరీలు అందుబాటులో ఉండగా, త్వరలో ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నాం. నా భర్త ఆలోచనల మేరకు వ్యవసాయ పరిశోధనలకు నేను తోడ్పడుతున్నా.

- జ్యోతిరెడ్డి

లాభసాటి సాగు

ఏ పంట పండిస్తే రైతు బాగుపడతాడు.. ఏ నేలకు.. ఏ పంట, ఏ మొక్కలు నాటితే అధిక దిగుబడి వస్తుందనే ఆలోచనలతో ప్రాచీన వ్యవసాయానికి.. ఆధునిక వ్యవసాయాన్ని అనుసంధానం చేయడమే లక్ష్యంగా ముందుకుపోతున్నారు భువనగిరి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన జిట్టా జ్యోతిరెడ్డి. తన భర్త జిట్టా బాల్‌రెడ్డితో కలిసి వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారామె. 16 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కోళ్లు, పశువులు, పప్పులు, కూరగాయలు, వరి పంటలతో మిక్స్‌డ్ క్రాప్‌కల్చర్ చేపడుతున్నారు. పంటలకు సోకే చీడపీడల నివారణకు అగ్రి హోమియో మందులను వాడుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా ఆవిష్కరణలు చేస్తున్నారు. పండించిన పంటలకు సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటూ.. సోషల్ మీడియా, మౌత్ టూ మౌత్ ప్రచారంతో అమ్మకాలు చేపడుతున్నారు. మునగాకు పొడి, పచ్చళ్లు, నెయ్యి, కారంపొడులు, నెయ్యి అమ్ముతూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఆమె ప్రతిభకు అనేక అవార్డులు దక్కాయి. గ్రామ భారతీ స్వచ్ఛంద సంస్థ ద్వారా నారి శక్తి, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఉత్తమ మహిళా అవార్డులను ఆమె సొంతం చేసుకున్నారు.



సన్మానం పొందుతున్న జ్యోతి, బాల్‌రెడ్డి (ఫైల్)

మృతదేహంతో ఇంటి ఎదుట ఆందోళన

నిడమనూరు : త్రిపురారం మండలం కొనతాలపల్లికి చెందిన పెద్ది సైదులును కొట్టడంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ శుక్రవారం మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన బొమ్ము శివ ఇంటి వద్ద ఆందోళన చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం కొనతాలపల్లికి చెందిన పెద్ది సైదులు నిడమనూరులోని లిటిల్ ఏంజల్స్ స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. దీంతో అతడు మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళతో సఖ్యతా మెలగడంతో గ్రామానికి చెందిన బొమ్ము శివ అతడి అనుచరులు కలిసి మూడు నెలల క్రితం సైదులును కొట్టారు. దీంతో సైదులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. శివ అతడి అనుచరులు కొట్టడంతోనే మృతి చెందాడని సైదులు బంధువులు ఆరోపిస్తూ మృతదేహాన్ని బొమ్ము శివ ఇంటిలో పెట్టి ఆందోళన చేపట్టారు. దీంతో శివ కుటుంబ సభ్యులు ఉదయమే ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. హాలియా సీఐ గాంధీనాయక్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. హాలియా ఎస్‌ఐ క్రాంతికుమార్, నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబు వెంగన్నగూడెంలో ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. అనంతరం పోస్ట్‌మార్టమ్ నిమ్తితం సైదులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు సైదులు తండ్రి పెద్ది రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.



వెంగన్నగూడెంలో శివ ఇంటి వద్ద సైదులు మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



సైదులు (ఫైల్)

త్రిపురారం : దాడిచేసిన ఘటనలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణతాలపల్లి గ్రామానికి చెందిన పెద్ది సైదులు నిడమనూరులో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇదే క్రమంలో నిడమనూరు మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళతో చనువుగా ఉంటున్నాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సైదులును గత నెల కిందట దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు.

వేధింపులు తాళలేక దంపతుల ఆత్మహత్యాయత్నం

తిరుమలగిరి (తుంగతుర్తి) : కొడుకు చేసిన అప్పులకు తల్లిదండ్రులను వేధించడంలో దంపతులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల వెంకన్న, రమాదేవిల కుమారుడు సాయికుమార్ స్థానికంగా ఓ ఫైనాన్షర్ వద్ద రూ.70వేలు అప్పు తీసుకున్నాడు. అప్పు అధిక వడ్డీతో 16నెలలకు రూ.3లక్షలు ఇవ్వాలని ఫైనాన్షర్ అడగడంతో సాయికుమార్ కొద్ది రోజులు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఫైనాన్స్ ఇచ్చిన వ్యక్తి తల్లిదండ్రుల వద్దకు వచ్చి వేధిస్తుండటంతో శుక్రవారం వారు పెట్రోల్ డబ్బాతో వచ్చి స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. దీంతో అక్కడి స్థానికులు, పోలీసులు కలిసి వెంటనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న, రమాదేవి మాట్లాడుతూ.. అధిక వడ్డీలతోని తమ కుమారుడిని, తమను వేధించారని, ఫైనాన్స్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నాగారం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని ఫణిగిరి శివారులో సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాందారుపల్లి గ్రామానికి చెందిన రాగుల రాజు(22) వరికోత మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వరికోతల నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు వెళ్లి అక్కడ వరికోతలు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామానికి పయనమయ్యాడు. మార్గమధ్యంలో మండలంలోని ఫణిగిరి శివారులోకి రాగానే వరికోత మిషన్ అదుపుతప్పి కుడి వైపు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ సీట్‌లో ఉన్న రాజు ఎగిరి కిందపడడంతో తల, నుదుటి భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

ఉరివేసుకొని యువకుడు బలవన్మరణం

మునుగోడు : తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు పరిధిలోని లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన చెన్నగోని వరప్రసాద్(21) నల్లగొండ శివారులోని మర్రిగూడలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని డిగ్రీ చదువుతున్నాడు. చదువుతో పాటు పార్ట్ టైమ్‌గా తన బాబాయ్ కంప్యూటర్ షాప్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే షాప్‌కు వెళ్లిన ప్రసాద్ కొద్ది సేపటికి తనకు ఒంట్లో బాగోలేదని రూమ్‌కు వచ్చాడు. అతడితో పాటు అద్దెకు ఉంటున్న అతడి సోదరుడు మధ్యాహ్నం భోజనానికి రూమ్‌కు రాగా వంట గదిలో ప్రసాద్ ఉరివేసుకొని కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో మరో యువకుడు..

నల్లగొండ క్రైం : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పున్నమిలాడ్జిలో శుక్రవారం బొట్టుగూడకు చెందిన దీపక్(21) ఫ్యాన్‌కు ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీపక్ అదే లాడ్జిలో కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతోనే ఉరివేసుకోని మృతి చెందాడని మృతుడి పెదనాన్న రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన వివాహిత జిల్లా పద్మ (26) భర్త వేధింపులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం ఉర్లుగొండకు చెందిన పద్మకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గైగోళ్లపల్లికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ విజయ్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యను విజయ్‌కుమార్ అనుమానంతో వేధిస్తుండటంతో గైగోళ్లపల్లి నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డుకు మకాం మార్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో మనస్తాపంతో పద్మ శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లోనే చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్టు

- 3తులాల పుస్తెలతాడు, పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్ : చెడు అలవాట్లకు బానిసై చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సంగ్రాల అశోక్, తిరుమలగిరి మండలం నేతాపురం గ్రామానికి చెందిన నాగబోయిన కోటి, కడియాల బావ్‌సింగ్ బెట్టింగ్‌లు పాల్పడుతూ చెడు వ్యసనాలకు బానిసలుగా మారారు. ఈ క్రమంలో వారు చేసిన అప్పులను తీర్చేందుకు ఒంటరిగా ఉండే మహిళలను టార్గెట్ చేసుకుని బంగారం చోరీకి పాల్పడ్డారు. ఈనెల 4న పట్టణంలోని రామచంద్రగూడెంలో ఓ కిరాణం దుకాణం వద్దకు వెళ్లిన ముగ్గురు యువకులు సిగరేట్ ఇవ్వాలని షాపు మహిళను అడగగా సిగరేట్ ఇస్తున్న క్రమంలో ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 3తులాల బంగారు పుస్తెలతాడు, పల్సర్ బైక్‌తో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎస్.కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు కె.నరేష్‌కుమార్, రామకృష్ణ, రాగ్యానాయక్, ధనుంజయ, కళ్యాణ్, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నరసింహారావు

చికిత్స పొందుతూ పలువురు మృతి

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ ఏఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 13న చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40పైగా ఉంటుందని, మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు వెల్లడించారు. 94404 24641ను సంప్రదించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని కోరారు.

గీతకార్మికుడు..

భువనగిరి : తాటిచెట్టు పైనుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ముస్యాలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈరగాని శ్యాంగౌడ్ (28) ఈనెల 13న తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు, ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కాలుజారి పడడంతో త్రీవ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స కోసం అదే రోజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.



శ్యాంగౌడ్ (ఫైల్)

పురుగుల మందు తాగి..

చండూరు : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బనబోయిన శివ (25) బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. గ్రామంలో ఓ ప్రేమ విషయమై ఇటీవల పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు, దీంతో తనపై కేసులు నమోదైతే ఉద్యోగం రాదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది.

ఎంపీటీసీపై ఎస్‌ఐ దాడి

మునగాల(కోదాడ): మండలంలోని కొక్కిరేణి గ్రామ ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డిపై శుక్రవారం రాత్రి మునగాల ఎస్‌ఐ పి.లోకేష్ చేయి చేసుకోవడంతో గాయపడ్డాడు. వివరాల ప్రకారం.. శుక్రవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో జరిగే బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేను జైభీమ్ గురించి అడగడంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌ఐ లోకేష్ శ్రీనివాసరెడ్డిని అడ్డుకోవడమే కాక దాడి చేసి ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. తాను ఎంపీటీసీనని మొరపెట్టుకున్నప్పటికీ పోలీసులు వినకుండా కొట్టుకుంటూ తీసుకుపోయారని శ్రీనివాసరెడ్డి వాపోయాడు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా.. ఎంపీటీసీ మద్యం మత్తులో సభాస్థలికి వచ్చి న్యూసెన్స్ చేస్తుండగా తాము మందలించి పంపించామని, తాను చేయి చేసుకోలేదని ఖండించారు.



గాయపడిన ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి